సాక్షి జయశంకర్ భూపాలపల్లి

బుధవారం । 21 । మే । 2025



కొత్త సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు సిద్ధం..

కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. - 8లో▸



పీజీ పరీక్షలు షురూ

కేయూ పరిధిలో పీజీ కోర్సుల (నాన్ ప్రొఫెషనల్) రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్ నాలుగో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33.6^{0} /26.5^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం పలుచోట్ల ఈదురుగాలులు వీస్తాయి.





పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

అంతర్వాహిని.. పుణ్య ప్రదాయిని

'గంగేచ యమునే చైవ గోదావరీ సరస్వతీ నర్మదే సింధూ కావేరీ జలేస్మిన్ సన్నిధింకురు'.. అని నదీమతల్లికి నమస్కరించి భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అంతర్వాహినికి అంతఃకరణ శుద్ధితో పూజలు చేశారు. ఆరో రోజు మంగళవారం త్రివేణి సంగమంలో రద్దీ కొనసాగింది. కాళేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. వేలాది మంది ముక్తీశ్వరున్ని దర్శించుకున్నారు.

- మరిన్ని వివరాలు, ఫొటోలు 8, 9లో▸



దీపం వదులుతున్న మహిళ



గోదావరి మాతకు చీరసారె ఇస్తున్న ఆడపడుచులు



సైకత లింగానికి పూజలు చేస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

భక్తుల రద్దీ పెరిగే అవకాశం

● మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: రానున్న ఆరు రోజుల్లో సరస్వతి పుష్కరాలకు భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం (ఆరవరోజు) సాయంత్రం సరస్వతి పుష్కరాల్లో భాగంగా కాళేశ్వరంలో సరస్వతి నవరత్న మాల హారతి మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గడిచిన ఆరు రోజుల్లో లక్షలాది మంది భక్తులు పుష్కర స్నానాలు చేసి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారన్నారు. రానున్న ఆరు రోజులు చాలా కీలకమని.. భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ దంపతులు, ఎస్పీ కిరణ్ ఖరే, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ




భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. ఉన్నత పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లకు జిల్లాకేంద్రంలో, ప్రాథమిక పాఠశాల ఎస్జీటీలకు మండలకేంద్రంలో ఆర్పీలు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 24వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమానికి జీసీడీఓ శైలజ, క్వాలిటీ కోఆర్డినేటర్ కాగిత లక్ష్మణ్, ఆర్పీలు హాజరయ్యారు.

అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫిర్యాదు



కాటారం: కాటారం సబ్ డివిజన్‌లో అక్రమంగా చెరువులను తవ్వి మట్టి రవాణా చేపడుతున్నారని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్ మంగళవారం హైదరాబాద్‌లోని మానవహక్కుల కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా కాటారం సబ్ డివిజన్ కేంద్రంగా జరుగుతున్న మట్టి అక్రమ రవాణాపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తిని కొల్లగొడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ.10 కోట్ల విలువచేసే మట్టిని పలువురు అక్రమార్కులు దోచేశారని శ్రీకాంత్ ఫిర్యాదులో ప్రస్తావించారు. చెరువుల పరిరక్షణ నిబంధనలు ఉల్లంఘించి మట్టిని దోచుకుంటున్న వారిపై చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ఘటన

గణపురం: సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన గణపురం మండలం చెల్పూర్ గ్రామ శివారు రామప్ప కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. సింగరేణి ఉద్యోగి సిద్దార్థ్(36) కేటీకే-1 మైన్‌లో ట్రామర్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై రేఖ అశోక్ పేర్కొన్నారు.

భక్తులకు ఆహ్లాదం..

మెరుగులు దిద్దుకున్న ముక్తివనం పార్కు

● పుష్కర భక్తులు సేదదీరేందుకు సిద్ధం
● చూడముచ్చటగా ఏసీ ట్రీహౌస్‌లు
● బుకింగ్ కోసం మీ టిక్కెట్ యాప్

కాళేశ్వరం: సరస్వతి నది పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరానికి రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే లక్షలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ముక్తేశ్వరస్వామిని దర్శించుకుని వెళ్లారు. తిరిగి వెళ్లే సమయంలో ఆహ్లాదంతో పాటు.. సేదదీరేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో కాళేశ్వరంలోని ముక్తివనం పార్కుకు మెరుగులు దిద్దారు. ఇందుకోసం సీసీఎఫ్ ప్రభాకర్, కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఎఫ్‌ఓ నవీన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

పార్కు ప్రత్యేకత ఏంటంటే..

కాళేశ్వరంలోని ముక్తివనం పార్కులో నాలుగు ఏసీ ట్రీహౌస్‌లు చూడముచ్చటగా ఉన్నాయి. ఏసీ గదులను రోజుకు రూ.2,500 చొప్పున అద్దెకు ఇస్తున్నారు. గదులు అద్దెకు 'మీ టిక్కెట్' యాప్‌లో ఆన్‌లైన్ కూడా బుకింగ్ చేసుకోవచ్చు. అడవిలో సేదదీరొచ్చు. రాశివనం, పంచవటి వనం, నక్షత్ర వనం, సప్తరుషి వనం, సైకిలింగ్ పాత్‌వే, వాకింగ్‌పాత్‌వేలు ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకోవడానికి వస్తువులు, ప్రీ వెడ్డింగ్, బర్త్‌డే, షూట్స్ కూడా జరుగుతున్నాయి. వీటికి టిక్కెట్టు రూ. 1000 వరకు ఉంది.



ముక్తివనంలోని ట్రీహౌస్

వాటర్ ఫౌండ్, ఇతర ఆహ్లాదాన్ని పంచేవిధంగా పార్కును సిద్ధం చేశారు. పెద్దలకు రూ.20, చిన్నలకు రూ. 10 ప్రవేశ టిక్కెట్ ధర తీసుకుంటున్నారు. పుష్కర స్నానాలు, శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్న భక్తులు తిరుగు ప్రయాణంలో సేదదీరడానికి చాలా మంచి ప్రాంతంగా చెప్పవచ్చు. పార్కును ఎఫ్‌ఆర్‌ఓ రవికుమార్, ఎఫ్‌ఎస్‌ఓలు ఆనంద్, తిరుపతి, ఎఫ్‌బీఓ శ్రీలత పర్యవేక్షిస్తున్నారు.



ముక్తివనం స్వాగత తోరణం

విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు కృషి

● జిల్లా విద్యాధికారి రాజేందర్

రేగొండ(కొత్తపల్లిగోరి): విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ అన్నారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి ప్రభాకర్, కొత్తపల్లిగోరి మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కొత్తపల్లిగోరి మండల విద్యాధికారి రాజు ఆధ్వర్యంలో బోధనాభ్యాస ప్రక్రియలు అనే అంశంపై మంగళవారం శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాజేందర్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా అప్‌డేట్ కావాలన్నారు. బోధనలో ఐసీటీ వినియోగం, ఏఐ బోధన, ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమంపై అవగాహన పెంచుకోవాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదు పెరిగేలా కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్స్ పింగిళి విజయపాల్‌రెడ్డి, ప్రసాద్, అఫ్రజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రాజేందర్

అన్న ప్రసాదాలను వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్ : సరస్వతి పుష్కరాలకు కాళేశ్వరంవెళ్లే భక్తులు భూపాలపల్లి మండలం కమలాపురం క్రాస్ రోడ్డులో ఏర్పాటుచేసిన ఉచిత అన్న ప్రసాదాలను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. ఆరవ రోజు మంగళవారం మధ్యాహ్నం భక్తులకు ఎమ్మెల్యే గండ్ర భోజనాలు వడ్డించారు. అనంతరం భక్తులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరు రోజుల నుంచి పోలీస్, ఐకేర్ హాస్పిటల్ హైదరాబాద్, దాతల సహకారంతో ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఆరు రోజుల నుంచి ఉచిత అన్న ప్రసాదాలను ప్రతిరోజు సుమారు రెండు వేల మందికి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత అన్న ప్రసాదాల పంపిణీని 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు వచ్చిపోయే భక్తులు కమలాపూర్ క్రాస్ రోడ్డు దగ్గర ఆగి భోజనం చేయాలని ఎమ్మెల్యే కోరారు.



భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కార్మికవర్గానికి జాతీయ సంఘాల ద్రోహం

భూపాలపల్లి అర్బన్: జాతీయ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా 40కోట్ల మంది కార్మికవర్గానికి ద్రోహం చేశాయని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య ఆరోపించారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో 14 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. పాకిస్తాన్-భారత్ మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో సమ్మెను వాయిదా వేస్తున్నామని ప్రకటించాయన్నారు. కేంద్ర ప్రభుత్వంతో ఎటువంటి హామీ తీసుకోకుండా జాతీయ సంఘాలు సమ్మెను ఎలా వాయిదా వేస్తాయని ఆరోపించారు. జాతీయ కార్మిక సంఘాలు బీజేపీ ప్రభుత్వానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కుమారస్వామి, రాజన్న, జనార్దన్, ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గట్టయ్య

కోటగుళ్లను సందర్శించిన ఎస్‌ఐబీ డైరెక్టర్



కోటగుళ్లలో పూజలు నిర్వహిస్తున్న తరుణ్‌జోషి

గణపురం: మండల కేంద్రంలోని కోటగుళ్లను రాష్ట్ర ఎస్‌ఐబీ డైరెక్టర్ తరుణ్‌జోషి మంగళవారం సందర్శించారు. కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు జూలపల్లి నాగరాజు ఘన స్వాగతం పలికారు. శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. కోటగుళ్ల సంపదను కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిట్యాల సీఐ మల్లేష్, భూపాలపల్లి సీఐ నరేష్, ఎస్సై అశోక్ ఉన్నారు.

కంట్రోల్ రూంను పరిశీలించిన ఎస్పీ



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూంను మంగళవారం ఎస్పీ కిరణ్‌ఖరే మంగళవారం పరిశీలించారు. సరస్వతి పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరంలో పటిష్ట నిఘాను ఏర్పాటు చేశారు. కాళేశ్వరంలో ఏర్పాటు చేసి 220 సీసీ కెమెరాలు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. భద్రత నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ సీఐ రాంచందర్‌రావు, కాళేశ్వరం ఎస్సై తమాషారెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీలో 10వేల మంది ..

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరం సరస్వతి పుష్కరాల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో మంగళవారం కాళేశ్వరానికి సుమారు 10వేల మంది వచ్చినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 209 ఆర్టీసీ బస్సుల్లో 10వేల మంది కాళేశ్వరానికి చేరుకోగా.. 207 బస్సుల్లో 8,878వేల మంది భక్తులు తిరిగి గమ్య స్థానాలకు వెళ్లారు.

పుష్కరసేవలో సింగరేణి



పుష్కర ఘాట్ వద్ద సింగరేణి స్విమ్మర్లు

● రూ.78లక్షల నిధులు కేటాయించిన యాజమాన్యం
● భక్తుల సౌకర్యాల కల్పనకు సింగరేణి తోడ్పాటు

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా భక్తుల సౌకర్యాల కల్పనలో సింగరేణి యాజమాన్యం తోడ్పాటునందిస్తుంది. ప్రభుత్వంతో పాటు సింగరేణి సంస్థ సేవ కార్యక్రమాలతో పాటు పలు సౌకర్యాల ఏర్పాటులో ముందుంది. ప్రత్యేకంగా పుష్కరాలలో పలు కార్యక్రమాల నిర్వహణ కోసం యాజమాన్యం రూ.78లక్షల నిధులు కేటాయించింది. ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన సరస్వతి పుష్కరాల్లో కార్యక్రమాలు ప్రారంభించింది. ఈ నిధులతో ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్ నుంచి వీవీపీ సరస్వతి ఘాట్ వరకు ఉచితంగా 30 స్పెషల్ షెటిల్ సర్వీస్‌లను ప్రారంభించింది. పుష్కరాలకు ఆర్టీసీ బస్సుల ద్వారా వస్తున్న భక్తులను పుష్కర స్నానాలకు తరలిస్తున్నారు. ఎండ నేపథ్యంలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు చల్లటి తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను అందిస్తున్నారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు సేవలందించేందుకు సింగరేణి స్కౌట్ సిబ్బంది, పుష్కర ఘాట్‌ల వద్ద గోదావరిలో స్విమ్మర్లు, రెస్క్యూ సిబ్బందిని కేటాయించారు. వీరంతా కాళేశ్వరంలో పుష్కర విధులు నిర్వర్తిస్తున్నారు. పుష్కరాలు ముగిసే వరకు భక్తులకు సౌకర్యాలు, సేవలు కల్పించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు.



సింగరేణి ఆధ్వర్యంలో స్పెషల్ బస్సులు



ఆలయం వద్ద సింగరేణి స్కౌట్ బృందం

లండన్‌లో చదువుకున్నా.. మన సంస్కృతిని మరిచిపోలేదు



వేయిస్తంభాల దేవాలయంలో కమల్ చంద్ర భంజ్‌దేవ్‌కు మహాదాశీర్వచనం అందజేస్తున్న అర్చకులు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ తదితరులు

● కాలేజీ వదిలేసి దసరాకు వచ్చేవాడిని
● కాకతీయ 22వ వారసుడు కమల్ చంద్ర భంజ్‌దేవ్
● కోట, వేయిస్తంభాల గుడి, భద్రకాళి ఆలయంలో పూజలు

హన్మకొండ/హన్మకొండ కల్చరల్/ఖిలావరంగల్: లండన్‌లో చదువుకున్నా మన సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోలేదని కాకతీయ 22వ వారసుడు కమల్ చంద్ర భంజ్‌దేవ్ అన్నారు. మంగళవారం ఆయన మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్‌తో కలిసి నగరంలోని వేయిస్తంభాల గుడి, భద్రకాళి ఆలయం, ఖిలావరంగల్ కోటలోని స్వయంభు శంభు లింగేశ్వర ఆలయంలో, వడ్డెపల్లిలోని పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పోచమ్మ మైదాన్‌లోని రాణి రుద్రమదేవి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో ప్రజలతో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కాకతీయుల రాజధాని అయిన ఓరుగల్లు సాంస్కృతికపరంగా ఎంతో అభివృద్ధి చెందిందని, పారిశ్రామిక పరంగా అభివృదద్ధి జరిగేందుకు సలహాలు ఇవ్వాలని కోరారు. కాకతీయుల కాలంలో సాంస్కృతిక జీవనం విలసిల్లిందని, ఇప్పుడు ఆ సంస్కృతి, కళలు కాపాడడానికి మీరు ఏమైనా చేయగలుగుతారా అని ప్రజలు అడిగారు. కమల్ చంద్ర భంజ్‌దేవ్ స్పందిస్తూ తనకు కళలు, కళాకారులన్నా చాలా ఇష్టమని, సాధ్యమైనంతవరకు సంస్కృతిని కాపాడుతానన్నారు. తాను లండన్‌లో విద్యనభ్యసించే సమయంలో తమ వద్ద జరిగే దసరా వేడుకలకు కాలేజీ మానేసి వచ్చేవాడినన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించడం తనకు ఇష్టమన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం.శివాజీ, టార్చ్ కార్యదర్శి అరవింద్ ఆర్య, సేవా టూరిజం అండ్‌కల్చరల్ సొసైటీ వ్యవస్థాపకుడు కుసుమ సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



స్వయంభూ దేవాలయంలో పూజలు చేస్తున్న రాజు కమల చంద్ర భంజ్‌దేవ్, తదితరులు

ఇన్‌చార్జ్ సీఎండీలతో ఇబ్బందులు

- టీఎస్ఈఈయూ -327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్


అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, శ్రీధర్

హన్మకొండ: టీజీ జెన్‌కో, టీజీ ట్రాన్స్‌కోలో ఇన్‌చార్జ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లతో అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ఈఈయూ)–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. మంగళవారం హనుమకొండ వడ్డేపల్లి రోడ్‌లోని టీఎస్ఈఈయూ–327 కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం శ్రమశక్తి అవార్డు గ్రహీతల సన్మానం జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల నియామకంలో జాప్యంతో పాలనాపరమైన ఇబ్బందులు కలుగుతున్నాయని, వెంటనే నియామకాలు చేపట్టాలన్నారు. ఆర్థిక పరిస్థితి, ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఉద్యోగుల్లో అసంతృప్తి ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించడానికి విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో అపాయింట్‌మెంట్ ఇప్పించాలని సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ తాను ఈ కార్యక్రమం నుంచి విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో మాట్లాడానని, నాలుగైదు రోజుల్లో సమయం ఇస్తానని చెప్పారన్నారు. అనంతరం శ్రమశక్తి అవార్డు గ్రహీతలు పి.మహేందర్ రెడ్డి, నీలం ఐలేశ్, సురేశ్ కుమార్‌ను ఎమ్మెల్యే నాయిని, ఇనుగాల శ్రీధర్, నాయకులు సన్మానించారు. పీసీసీ నాయకుడు ఈ.వి.శ్రీనివాస్ రావు, టీఎస్ఈఈయూ–327 టీజీ ఎన్పీడీసీఎల్ సెక్రటరీ కొండూరి శ్రీనివాస్, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నరేందర్ రెడ్డి, మాధవ రావు, చిట్ల ఓదేలు, బుచ్చయ్య గౌడ్, జశ్వంత్ కుమార్, సదయ్య, శ్రీనివాస్, రవికుమార్ పాల్గొన్నారు.

కొత్త సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ

హన్మకొండ: కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్లు, నోడల్ అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 16 సర్కిళ్ల పరిధిలో పురోగతిలో ఉన్న ఇంటర్ లింకింగ్ లైన్ల పనులు యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని ఆదేశించారు. బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్ లేకుండా ప్రతీ నెల ఫీడర్ల నిర్వహణ చేపట్టాలన్నారు. ప్రీ మాన్సూన్ తనిఖీలు అన్ని ఫీడర్లలో చేపట్టాలని, తద్వారా అంతరాయాలు తగ్గుతాయన్నారు. సబ్ స్టేషన్ల నిర్వహణ చేసే సమయంలో అంతరాయం లేకుండా వేరే సబ్ స్టేషన్ నుంచి ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీఈలు కె.తిరుమల్ రావు, రాజుచౌహాన్, అశోక్, వెంకట రమణ, జీఎంలు వేణు బాబు, దేవేందర్, కృష్ణమోహన్, వెంకటకృష్ణ, శ్రీనివాస్, సత్యనారాయణ, సురేందర్, ఉత్తమ్, తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలు షురూ

- ఉదయం కేయూలో విద్యార్థుల ధర్నా
- మధ్యాహ్నం నుంచి యథావిధిగా ఎగ్జామ్స్


ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో పీజీ కోర్సుల (నాన్ ప్రొఫెషనల్) రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్ నాలుగో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ కొందరు విద్యార్థులు మంగళవారం ఉదయం కేయూలోని పరిపాలనా భవనం వద్ద ధర్నా నిర్వహించారు. పోలీసుల చొరవతో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ మనోహర్ విద్యార్థులతో చర్చించారు. త్వరగా పరీక్షలు జరిగితే ఎంతో మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని నచ్చజెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. టైంటేబుల్ ప్రకారం మధ్యాహ్నం 2గంటల నుంచి యథావిధిగా పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు కేయూ పరిధిలో 95 శాతం మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ తెలిపారు. వీరి వెంట పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య, వర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ మనోహర్, ఆర్ట్స్ కాలేజీ పరీక్ష కేంద్రంలో ప్రిన్సిపాల్ జ్యోతి ఉన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 22వ తేదీన జూనియర్స్ బాలబాలికల ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2009 నుంచి డిసెంబర్ 31, 2010 మధ్య జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆధార్, స్కూల్ బోనోఫైడ్, జనన ధ్రువీకరణ పత్రం జిరాక్స్‌ల తో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పాటు రూ.300 ఎంట్రీ ఫీజుతో ఉదయం 7గంటలకు హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్‌హాల్ నందు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 24వ తేదీన మంచిర్యాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పుష్కర స్నానం చేస్తున్న భక్తులు



పుష్కరుడికి నమస్కరిస్తున్న భక్తులు



వృద్ధురాలికి పుష్కర స్నానం చేయిస్తున్న కుటుంబీకులు




హైకోర్టు జడ్జికి చిత్రపటం అందజేస్తున్న ఉత్సవ కమిటీ చైర్మన్



గోదావరి తీరం..భక్తప్రవాహం

సరస్వతీనది పుష్కర స్నానాలకు భక్తుల రద్దీ

- తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ కొనసాగింపు..
- ఆరో రోజు స్వల్పంగా తగ్గిన భక్తులు
- ముక్తీశ్వరస్వామి ఆలయ క్యూలైన్‌లో బారులుదీరిన భక్తజనం
- హైకోర్టు జడ్జి, ఎస్ఐబీ డైరెక్టర్, ఇంటెలిజెన్స్ డీజీ పుష్కర స్నానం, దర్శనం
- 50వేల మంది వరకు భక్తులు పుష్కర స్నానాలు



భూపాలపల్లి/కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీనది పుష్కరాలకు భక్తులు తరలివచ్చారు. మంగళవారం ఆరో రోజు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్నాటక రాష్ట్రాల నుంచి తరలొచ్చి గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీనదిలో పుష్కర పుణ్యస్నానాలు ఆచరించారు. నదీమాతకు పూజలు చేశారు. పిండ ప్రదాన పూజలు చేశారు. పితృదేవతలకు తర్పణాలు నిర్వహించారు. నదీమాతకు చీర, సారె సమర్పించారు. ముత్తయిదువలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. గోదావరితీరం వద్ద భక్తప్రవాహం కనిపించింది. నదిలో దీపాలు వదిలి మొక్కులు చెల్లించారు. ఇసుకలో సైకత లింగాలు చేసి పూజించారు.



కలెక్టర్, ఎస్పీ పరిశీలన

పుష్కరాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ టీమ్‌లు, సింగరేణి, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే వాకీటాకీలతో మాట్లాడుతూ పరిశీలించారు. టెంట్‌సిటీ, ఆలయ పరిసరాలు, ప్రధాన రహదారుల్లో బ్లీచింగ్ చల్లించి పరిస్థితిని చూశారు. పుష్కర ఘాట్ గోదావరిలో బోటు ద్వారా భద్రతను పరిశీలించారు. బస్టాండ్ ప్రాంతంలో అదనంగా చలువ పందిళ్లు వేయాలని ఆదేశించారు. ఎస్పీ ట్రాఫిక్ నియంత్రణను పకడ్బందీగా చేట్టాలని ఆదేశించారు.



అష్టమితో తగ్గిన రద్దీ..

మంగళవారం అష్టమి సందర్భంగా భక్తుల రద్దీ తగ్గుముఖం పట్టింది. ఉదయం 10గంటల వరకు భక్తుల రద్దీ లేదు. ఆ తర్వాత క్రమక్రమంగా పెరిగింది. హైదరాబాద్, వరంగల్, భూపాలపల్లి, మంథని, కాటారం మీదుగా వాహనాలు తరలొచ్చాయి. ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు డివైడర్లతో నియంత్రించారు. పార్కింగ్ స్థలాల్లో వాహనాల రద్దీ కొనసాగింది.

రోడ్లు శుభ్రం..

ఆదిముక్తీశ్వరస్వామి నుంచి వీఐపీ ఘాట్ వెళ్లే మార్గంలో వర్షం పడితే రోడ్లపై దిగబడకుండా గ్రావెల్ చిప్స్ వేశారు. రోడ్లపై దుమ్ము లేవకుండా ట్యాంకర్లతో నీటిని చల్లుతున్నారు. గోదావరితీరం, ఆలయ పరిసరాలు, పార్కింగ్ ప్రాంతాలు, ఆర్టీసీ బస్టాండ్‌లు, ప్రధాన రహదారుల్లో పారిశుద్ధ్య కార్మికులు పనులు చురుగ్గా చేపట్టారు.

50వేల మంది స్నానాలు..

వివిధ రాష్ట్రాల నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాల్లో భక్తులు త్రివేణి సంగమం సరస్వతీనదికి వచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో దర్శనానికి క్యూలైన్‌లో బారులుదీరారు. మంగళవారం 50వేల మంది వరకు పుష్కర స్నానాలు చేసి దర్శనాలు చేసుకున్నట్లు అధికారుల అంచనా. పలువురు భక్తులు అక్కడక్కడ వడదెబ్బకు గురయ్యారు. వారిని కాళేశ్వరం పీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలందించారు. కొంత మందిని ఇతర పట్టణాలకు తరలించి వైద్యసేవలందించినట్లు వైద్యులు పేర్కొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు అందజేత..

భక్తులకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిక ప్యాకెట్లు అందించారు. ప్రధాన తూర్పు, దక్షిణ ద్వారాల ద్వారా క్యూలైన్లలో భక్తులను ఎప్పటికప్పుడు క్లియర్ చేశారు. ప్రత్యేకాధికారిగా మనోహర్‌ను నియమించారు. ఆయన క్రౌడ్ మేనేజ్‌మెంట్ చేపట్టారు.



పుష్కర స్నానానికి వస్తున్న భక్తులు

నదీహారతి ప్రత్యక్ష ప్రసారం..

సరస్వతి ఘాట్‌లో కాశీపండితులతో ఏర్పాటు చేసిన నవరత్నమాలిక హారతికి భక్తుల నుంచి విశేష స్పందన రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆదేశించారు. రాత్రి 7.30 గంటలకు 45 నిమిషాల పాటు జరిగే ఈకార్యక్రమాన్ని పుష్కరాలు పూర్తయ్యే వరకు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. కాశీ పండితులు ఏడుగురితో తొమ్మిది హారతులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగుల్లో హారతి ఇస్తున్నారు. రోజురోజుకూ పరిసర ప్రాంతాల భక్తులు వీక్షించడానికి తరలి వస్తున్నారు. రాత్రి 9 వరకు కూడా వరకు భక్తులు ఆయా పరిసరాల్లో కాలక్షేపం చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి.

ప్రముఖుల పూజలు..


సరస్వతీనది పుష్కరాలకు ప్రముఖులు హాజరయ్యారు. హైకోర్టు జడ్జి సృజన, ఎస్ఐబీ డైరెక్టర్ తరుణ్‌జోషి, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పుష్కర స్నానాలు ఆచరించి శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.


భక్తులతో పూజలు చేయిస్తున్న పురోహితుడు


పుష్కరాలకు విచ్చేసిన ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి

బంగారు వర్ణంలో సరస్వతీమాత విగ్రహం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతీనది పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన 17 అడుగుల ఏకశిల సరస్వతీమాత విగ్రహం మంగళవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో బంగారు వర్ణంలో దర్శమిచ్చింది. భక్తుల దృష్టిని ఆధ్యాత్మికత వైపుకు పయనించేలా కట్టిపడేస్తోంది. ఈ విగ్రహం పుష్కరాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.


విద్యుత్ వెలుతురులో సరస్వతీమాత విగ్రహం


సరస్వతీనది పుష్కరాల్లో భాగంగా నవరత్నమాల హారతి ఇస్తున్న కాశీ పండితులు


నవరత్నమాలిక హారతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, తదితరులు

పెళ్లింట్లో తీవ్ర విషాదం..

విద్యుత్‌షాక్‌తో నవవరుడి మృతి

- రిసెప్షన్ ఏర్పాట్లు చేస్తుండగా ప్రమాదం
- కోడిపుంజులతండాలో ఘటన


నరేశ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

బయ్యారం: మూడుముళ్లు.. ఏడు అడుగుల బంధంతో ఒక్కటైన ఆ జంటపై దేవుడు చిన్న చూపు చూశాడు. అప్పటి వరకు పెళ్లి బాజాలు మోగిన ఆ ఇంట.. చావు డప్పు మోగాల్సి వచ్చింది. కోటి ఆశలతో కొత్త జీవితం ప్రారంభమై 48 గంటలు గడవకముందే నవవరుడు కన్నుమూశాడు. రిసెప్షన్ ఏర్పాట్లు చేస్తుండగా విద్యుదాఘాతం సంభవించి మృతి చెందాడు. భర్త తన కళ్లెదుటే కానరానిలోకాలకు వెళ్లడంతో ఆ నవవధువు స్పృహ తప్పడంతో బంధువులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాళ్లకు పెట్టిన పారాణితోనే ఆ వరుడు పాడె ఎక్కిన విషాదకరఘటన పలువురిని కన్నీటిపర్యంతం చేసింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గౌరారం పంచాయతీ శివారు కోడిపుంజులతండాకు చెందిన ఇస్లావత్ బాల, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. 14 సంవత్సరాల క్రితం బాల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బతుకుదెరువు నిమిత్తం ఇద్దరు కుమారులు గణేశ్, నరేశ్ (26)తో కలిసి తల్లి లక్ష్మి హైదరాబాద్‌లో ఉంటుండగా నరేశ్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో నరేశ్‌కు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కంచికచర్ల గ్రామానికి చెందిన బానోత్ జాహ్నవితో వివాహం నిశ్చియం కాగా స్వగ్రామంలో రిసెప్షన్ నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా రిసెప్షన్ కోసం ఇటీవల రేకుల ఇల్లు నిర్మించుకున్నారు. ఆదివారం కంచికచర్లలో జాహ్నవితో వివాహం జరిపించారు.

మోటారు రూపంలో బలితీసుకున్న కరెంట్..


రిసెప్షన్ సందర్భంగా మంగళవారం తెల్లవారుజాము నుంచే నరేశ్ ఇంటి వద్ద ఏర్పాట్లు మొదలు పెట్టారు. వంట చేసే వారు భోజనాల తయారీలో నిమగ్నమయ్యారు. వంట కోసం నీళ్ల అవసరం ఏర్పడడంతో నరేశ్‌ను మోటార్ ఆన్‌చేయని కోరారు. దీంతో నరేశ్ మోటార్ ఆన్ చేసే ప్రయత్నంలో విద్యుత్‌తీగలను సాకెట్‌లో పెడుతుండగా షాక్‌గురయ్యాడు. దీంతో కుటుంబీకులు, స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. దీంతో నరేశ్ మృతదేహం మీదపడి కుటుంబీకులు, బంధువులు గుండెలవిసేలా రోదించారు. మృత్యువు కరెంట్‌రూపంలో బలి తీసుకుందని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

చనిపోయే ముందు ఉప్మా అందించాడు..

రిసెప్షన్ సందర్భంగా నరేశ్ ఉదయం తండాలోని పలువురు బంధువుల వద్దకు వెళ్లి ఉప్మా (అల్పాహారం) ఇచ్చి వచ్చాడు. ఆప్యాయంగా ఉప్మా అందించిన నరేశ్ ఇలా తమకు కన్నీటిని మిగిల్చి వెళ్తాడనుకోలేదని బంధువులు గుండెలవిసేలా రోదించారు.

కన్యాదానం చేసిన 48 గంటల్లోనే నవవధువు తండ్రి మృతి

బయ్యారం: బిడ్డకు వేదమంత్రాల నడుమ కన్యాదానం చేసిన తండ్రి 48 గంటల వ్యవధిలో కాలం చేసి ఆ కుటుంబంలో విషాదం నింపాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లిలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన జంగిలి సతీష్(46)– శోభ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె వివాహం కొన్నేళ్ల క్రితం జరగగా, చిన్నకుమార్తె అక్షయ వివాహం ఆదివారం నిర్వహించారు. పెళ్లి పూర్తయిన తర్వాత రెండురోజులుగా సతీష్ స్థానికంగా ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వడదెబ్బ తగలడంతో వాంతులు, విరోచనాలవుతున్నాయి. స్థానికంగా వైద్యం చేయించినప్పటికీ పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


సతీష్(ఫైల్)

పట్టుబడిన గంజాయి దహనం


గంజాయిని దహనం చేస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం: తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ విభాగం ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 19 కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.4.28 లక్షల విలువైన 856 కిలోల గంజాయిని మంగళవారం అమ్మవారిపేటలోని కాకతీయ మెడిక్లీన్ సర్వీస్‌లో డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సమక్షంలో దహనం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రవి, ఏసీపీ డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

వడదెబ్బతో పారిశుద్ధ్య కార్మికుడి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

కాటారం: సరస్వతీనది పుష్కరాల్లో భాగంగా విధులు నిర్వర్తిస్తూ ఓ పారిశుద్ధ్య కార్మికుడు వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబీకుల కథనం ప్రకారం.. కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన జీపీ పారిశుద్ధ్య కార్మికుడు మంతెన శ్రీనివాస్(35) ఈ నెల 15 నుంచి నాలుగు రోజుల పాటు కాళేశ్వరంలో పుష్కరాల విధులు నిర్వర్తించాడు. పనులు చేస్తూ ఆదివారం ఎండతీవ్రతకు అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అధికారులు కాళేశ్వరంలోని వైద్య శిబిరంలో ప్రథమ చికిత్స చేయించి ఇంటికి పంపించారు. అయితే పరిస్థితి విషమించి సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు.